# ఆరోగ్యవంతమైన ప్రజలతోనే వికసిత్ భారత్ నిర్మాణం

**●ఆరోగ్యం, పోషకాహారం, ఫిట్‌నెస్‌పై అవగాహన మహా ఉద్యమంగా మారాలి: కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్05 (నేటి దర్శిని):** ఆరోగ్యవంతమైన ప్రజలు లేకుండా ఆరోగ్యవంతమైన, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడం సాధ్యం కాదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలంటే ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, ఫిట్‌నెస్, క్రీడలు, మహిళలు, పిల్లల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఏ.వి. కళాశాల ప్రాంగణంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు నిర్వహించిన జాతీయ పోషణ మాసోత్సవం ముగింపు కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్విజ్, పోస్టర్ మేకింగ్, వీడియో మేకింగ్, పోషకాహార వంటకాల తయారీ వంటి పోటీల ద్వారా విద్యార్థులు, యువత, మహిళల్లో ఆరోగ్యంపై చైతన్యం తీసుకురావాలని అన్నారు. పోషణ కార్యక్రమాలు కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజా ఉద్యమంగా మారాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై స్వయంగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు




తగినంత నిద్ర, వ్యాయామం, నడక, యోగా, క్రీడలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అవసరానికి మించి నూనె, చక్కెర వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించిన కేంద్ర మంత్రి.. పిల్లలు, యువతలో అధిక బరువు, స్థూలకాయం వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించాలని అన్నారు. ఇంటివద్ద తయారు చేసే తాజా, పోషక విలువలున్న ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, జంక్ ఫుడ్‌పై అధికంగా ఆధారపడే అలవాటును తగ్గించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జీవనాన్ని సులభతరం చేసినప్పటికీ శారీరక శ్రమను తగ్గించిందని కిషన్ రెడ్డి అన్నారు. సెల్‌ఫోన్, కంప్యూటర్, టెలివిజన్ వంటి డిజిటల్ పరికరాల వినియోగాన్ని పరిమితం చేయాలని, ముఖ్యంగా రాత్రివేళల్లో మొబైల్ వినియోగాన్ని తగ్గించి సమయానికి నిద్రపోవాలని సూచించారు. దేశ భవిష్యత్తును నిర్మించాల్సిన యువత మాదకద్రవ్యాల బారిన పడటం ఆందోళనకరమని ఆయన అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, పోలీసు శాఖ, స్వచ్ఛంద సంస్థలు, సమాజంలోని ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 'నషా ముక్త్ భారత్', 'ఫిట్ ఇండియా', 'డ్రగ్ ఫ్రీ ఇండియా' వంటి కార్యక్రమాలు కేవలం నినాదాలు కాదని, దేశ భవిష్యత్తు కోసం చేపడుతున్న కార్యాచరణలో భాగమని ఆయన పేర్కొన్నారు. భారత యువశక్తిని ఆరోగ్యవంతంగా, శక్తివంతంగా తీర్చిదిద్దితేనే దేశం అభివృద్ధిలో మరింత ముందుకు సాగగలదని అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణ లక్ష్యాన్ని సాధించేందుకు ఆరోగ్యవంతమైన సమాజం కీలకమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**అవగాహన నుంచి ఆచరణ వైపు**

ఈ కార్యక్రమంలో పీఐబీ, సీబీసీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్ మాట్లాడుతూ.. ఐదు రోజుల కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించామని తెలిపారు. వివిధ పోటీలు, కార్యక్రమాల ద్వారా సమతుల్య ఆహారం ప్రాధాన్యతను వివరించామని అన్నారు. అవగాహన కార్యక్రమం ముగింపు కాదని, ఆరోగ్యకరమైన జీవనశైలిని ఆచరణలో పెట్టేందుకు ఇది నాంది అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి, ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన, బలమైన భారతదేశ నిర్మాణానికి తోడ్పడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామ జగన్మోహన్ రెడ్డి, ఏ.వి. ఎడ్యుకేషన్ బోర్డు సభ్యులు కె. వినోద్ రెడ్డి, ఏ.వి. కాలేజ్ కరస్పాండెంట్, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు, సిబ్బంది, కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ నాగోల్ శాఖ కార్యవర్గ సమావేశం



**నాగోల్, సెప్టెంబర్ 5 (నేటి దర్శిని):** నాగోల్ లోని కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ కమ్యూనిటీ హాల్ లో శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, నాగోల్ శాఖ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాగోల్ శాఖ అధ్యక్షులు బి.వి. ప్రతాప రెడ్డి, కార్యదర్శి ఏలూరు అశోక్ కుమార్ రావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి యం. హనుమంత రెడ్డి, ఆర్థిక కార్యదర్శి వి. అశోక్, అసోసియేట్ అధ్యక్షుడు నరసింహా రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ప్రచార కార్యదర్శి యన్. మహేశ్వరీ దేవి, సభ్యులు లాలయ్య గౌడ్, పి.వి. సుబ్బారావు, పి. సత్యనారాయణ, ఏ. లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. సంఘ సభ్యుల సంక్షేమం, రాబోయే కార్యక్రమాల నిర్వహణపై ఈ సందర్భంగా చర్చించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## బీసీ బాలుర భవన నిర్మాణ పనుల పరిశీలన

**●మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు**





**ఆమనగల్లు, సెప్టెంబర్ 05 (నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని మాడుగుల వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన నిర్మిస్తున్న బీసీ బాలుర వసతి గృహ భవన నిర్మాణ పనులను శనివారం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు పరిశీలించారు. ఆమనగల్లు పట్టణంలో శిథిలావస్థకు చేరిన బీసీ బాలుర వసతి గృహాన్ని గత ఏడాది కూల్చివేసి నూతన భవన నిర్మాణం చేపట్టారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి ప్రత్యేక చొరవతో అరబిందో ఫార్మా కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి సిఎస్ఆర్ నిధుల కింద రూ. 4 కోట్లు తీసుకువచ్చారు. అనంతరం బీసీ బాలుర వసతి గృహ భవన నిర్మాణ పనులకు ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే రెండు స్లాబ్ లను పూర్తి చేశారు. భవన నిర్మాణ పనులను గుర్రం కేశవులు పరిశీలించారు. భవన నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయని గుర్రం కేశవులు తెలిపారు.





## రామకృష్ణాపురంలో ఘనంగా హనుమాన్ దేవాలయ దశాబ్ది ఉత్సవాలు

**●దేవాలయంలో పవిత్ర యజ్ఞంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**●ఐదు ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం..**

**●లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు, రేషన్ కార్డుల పంపిణీ**

**●రూ.40 లక్షలతో భూగర్భ మురుగు కాలువలు, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన**

**తలకొండపల్లి, సెప్టెంబర్ 5 (నేటి దర్శిని):** తలకొండపల్లి మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో శ్రీ హనుమాన్ దేవాలయ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన పవిత్ర యజ్ఞ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మాణం పూర్తయిన ఐదు ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు, రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అదేవిధంగా హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ నిధులతో రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ మురుగు కాలువలు, సిమెంట్ కాంక్రీట్ రోడ్డు పనులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లు ఎక్సైజ్ సిఐ గా బాధ్యతలు చేపట్టిన పటేల్




**ఆమనగల్లు ,05(నేటి దర్శిని);** ఆమనగల్లు నూతన ఎక్సైజ్ సీఐ గా 'పటేల్ 'శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన బద్య నాథ్ చౌహాన్ మెదక్ ఎన్ ఫోర్స్ మెంట్ కు బదిలీ కాగా, ఆయన స్థానంలో పటేల్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖ పరిధిలో అక్రమ మద్యం, గుడుంబా తయారీ విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ప్రజలు అక్రమ కార్య కలాపాలపై సమాచారం అందించి శాఖకు సహకరించాలని ఎక్సైజ్ సీఐ పటేల్ కోరారు.

# పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

**●సాగునీటి హక్కుల కోసం అన్ని వర్గాలు ఉద్యమంలో భాగస్వాములు కావాలి**

**●పాలమూరు నీళ్లు పాలమూరికే దక్కాలి జి. రాజేందర్‌రెడ్డి**

**మిడ్జిల్, సెప్టెంబర్ 5, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ కన్వీనర్ జి. రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.




శనివారం జడ్చర్లలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులకు నిరంతరంగా నిధులు కేటాయిస్తే రెండేళ్లలో పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఉదండాపూర్ నుంచి లక్ష్మీదేవిపల్లి వరకు పనులు పూర్తి చేయాలని కోరారు. పాలమూరు నీటిని ఇతర ప్రాంతాలకు తరలించే ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని, "మా నీళ్లు మాకే.. పాలమూరు నీళ్లు పాలమూరికే" అనే నినాదంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. సాగునీటి హక్కుల పరిరక్షణ కోసం యువత, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు, మేధావులు, ప్రజా సంఘాలు సహా అన్ని వర్గాల ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో జేఏసీ నాయకులు చన్నకృష్ణయ్య, రాఘవాచారి, శంకర్‌బాబు, మోహన్, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దిన పత్రిక | RNI NO: TGTEL/25/A0471 | సత్య శోధనే మా లక్ష్యం | WWW.NETIDARSHINI.COM

## తలకొండపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు







**తలకొండపల్లి, సెప్టెంబర్ 5 (నేటి దర్శిని):**
తలకొండపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల గొప్పతనాన్ని వివరిస్తూ ప్రసంగాలు నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, క్రమశిక్షణ, విద్య, విలువలను అందిస్తూ సమాజానికి ఉత్తమ పౌరులను తయారు చేస్తున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేసి, గురువుల పట్ల తమకున్న గౌరవాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

**●కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



**మిడ్జిల్ మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 05, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో) :**
వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి శాంతి కమిటీ సమావేశంలో ఎస్పీ డి.జానకితో కలిసి ఆమె పాల్గొన్నారు.
గణేష్ మండపాలు, నిమజ్జన ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్.. శోభాయాత్ర మార్గాల్లో విద్యుత్ తీగలను సరిచేయడం, రహదారుల మరమ్మతులు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, అగ్నిమాపక, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లు, గజ ఈతగాళ్లు, అంబులెన్స్‌లు, ఫస్ట్‌ఎయిడ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నీటి కొరత దృష్ట్యా చిన్న విగ్రహాల నిమజ్జనం కోసం గ్రామాలు, మున్సిపాలిటీల్లో కృత్రిమ నిమజ్జన కొలనులు ఏర్పాటు చేయాలని తెలిపారు.

**నిబంధనలు పాటించాలి: ఎస్పీ డి.జానకి**

గణేష్ ఉత్సవాలను ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ డి.జానకి కోరారు. మట్టి, చిన్న విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, డీజేలు, అధిక శబ్ద కాలుష్యానికి దూరంగా ఉండాలని సూచించారు. మిశ్రమ జనాభా ప్రాంతాల్లో ఇతర వర్గాల మనోభావాలను గౌరవిస్తూ మండపాలు ఏర్పాటు చేయాలని, రహదారులను పూర్తిగా మూసివేసి ప్రజలకు ఇబ్బంది కలిగించరాదని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డీఆర్ఓ ఎ.నిర్మల, అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం, జిల్లా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, సెప్టెంబర్ 05(నేటి దర్శిని);**
అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆమనగల్ పట్టణంలోని రైతు వేదిక లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పేద కుటుంబాలకు రేషన్ కార్డులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా లబ్ధిదారులకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు యాట నరసింహా, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, డైరెక్టర్ శ్రీశైలం, కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్, మండల పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, కౌన్సిలర్లు ముక్తాల వెంకటయ్య, ఎర్రవోలు మహేష్, ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్, పార్టీ ముఖ్య నాయకులు కృష్ణ నాయక్, మెకానిక్ బాబా, శ్రీకాంత్,దేవరశెట్టి మహేష్, శివ, కుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

**●జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్**






**మిడ్జిల్, సెప్టెంబర్ 5, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్ నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ కోర్టు లైజన్ అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే సెప్టెంబర్ 12, 2026న నిర్వహించనున్న లోక్ అదాలత్లో వీలైనంత ఎక్కువ కేసులను చట్టపరమైన నిబంధనలకు లోబడి రాజీ మార్గం ద్వారా పరిష్కరించేలా కృషి చేయాలని అధికారులకు ఎస్పీ సూచించారు. లోక్ అదాలత్‌కు పరిష్కారానికి అనుకూలంగా ఉన్న కేసులను ముందుగానే గుర్తించి, ఆయా కేసుల్లోని కక్షిదారులతో సమన్వయం చేసుకుని సమర్థవంతమైన కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. కేసు పరిష్కారానికి ఇరుపక్షాల అంగీకారం, చట్టపరమైన అవకాశం ఉన్న సందర్భాల్లో మాత్రమే రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

**రాజీ మార్గమే రాజమార్గం**

కేసులు సంవత్సరాల తరబడి కోర్టుల్లో కొనసాగడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు, శ్రమ వృథా కావడంతో పాటు కుటుంబ సభ్యులపై కూడా మానసిక ఒత్తిడి పెరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు. చాలా సందర్భాల్లో ఒకే గ్రామంలో లేదా ఒకే ప్రాంతంలో నివసించే వ్యక్తులు చిన్నచిన్న వివాదాల కారణంగా కేసులు పెట్టుకుని సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ పరస్పర కక్షలను పెంచుకుంటున్నారు. ఒకరి ముఖాలు ఒకరు ప్రతిరోజూ చూస్తూ కూడా కేసుల కారణంగా శత్రుత్వాన్ని కొనసాగించడం వల్ల ఆ ప్రభావం కుటుంబ సభ్యులపై, ముఖ్యంగా పిల్లలపై కూడా పడే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఈ కక్షలు మరో వివాదానికి దారితీసే అవకాశం ఉంటుంది. అందువల్ల సాధ్యమైన చోట 'రాజీ మార్గమే రాజమార్గం' అనే విషయాన్ని కక్షిదారులకు అర్థమయ్యే విధంగా వివరించాలి" అని ఎస్పీ సూచించారు.

1. కేసు కొనసాగితే కలిగే ఆర్థిక భారం, సమయం, శ్రమ, మానసిక ఒత్తిడి గురించి వివరించాలి.
2. కోర్టు కేసుల కారణంగా కుటుంబ సంబంధాలు, గ్రామీణ సామాజిక సంబంధాలు దెబ్బతినే అవకాశం ఉందని తెలియజేయాలి.
3. చిన్న వివాదాలు దీర్ఘకాలిక కక్షలకు దారితీయకుండా సామరస్యపూర్వక పరిష్కారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలి.
4. చట్టపరంగా రాజీకి అవకాశం ఉన్న కేసుల్లో ఇరుపక్షాల అంగీకారంతో లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం పొందే అవకాశాన్ని తెలియజేయాలి.
5. కక్షిదారులపై ఎలాంటి ఒత్తిడి, బలవంతం చేయకుండా, వారికి పూర్తి విషయాన్ని వివరించి స్వచ్ఛందంగా, చట్టబద్ధంగా పరిష్కారానికి ముందుకు వచ్చేలా కౌన్సిలింగ్ చేయాలి.
6. కేసుల స్థితిగతులు, కోర్టు పరిధి, రాజీకి ఉన్న చట్టపరమైన అవకాశం తదితర అంశాలను పరిశీలించి సంబంధిత న్యాయ అధికారులతో సమన్వయం చేసుకోవాలి.
7. ఇప్పటికే ఇరువర్గాల మధ్య సఖ్యత ఏర్పడిన కేసుల్లో ఆలస్యం చేయకుండా అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి లోక్ అదాలత్‌లో పరిష్కారానికి కృషి చేయాలి.

"ఒక కేసు ముగియడం అంటే కేవలం ఒక ఫైల్ మూసివేయడం కాదు.. రెండు కుటుంబాల మధ్య ఉన్న వివాదానికి శాశ్వత పరిష్కారం చూపించడం. చట్టపరంగా అవకాశం ఉన్న ప్రతి కేసులో ఇరుపక్షాలకు ప్రయోజనం కలిగే విధంగా, సమర్థవంతమైన కౌన్సిలింగ్ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి" అని ఎస్పీ అధికారులకు సూచించారు.
అలాగే కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, చార్జిషీట్‌ల దాఖలు, సమన్లు, వారెంట్ల అమలు, సాక్షుల హాజరు, కోర్టు ప్రొసీడింగ్స్ తదితర అంశాల్లో సంబంధిత కోర్టు సిబ్బందితో సమన్వయం చేసుకుని కేసుల పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు.
కేసుల దర్యాప్తు నుంచి కోర్టు విచారణ పూర్తయ్యే వరకు ప్రతి దశలో బాధ్యతతో వ్యవహరించి, న్యాయస్థానాల్లో కేసుల సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌కు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.
లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా చట్టపరంగా పరిష్కరించదగిన కేసులను సత్వరంగా పరిష్కరించి, కక్షిదారులకు సమయం, ధనం, శ్రమ ఆదా చేయడంతో పాటు సమాజంలో శాంతి, సామరస్యాలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ పిలుపునిచ్చారు.

## గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**●గురువులే సమాజానికి మార్గదర్శకులు**
**●జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్**








**మిడ్జిల్, సెప్టెంబర్ 5, (నేటి దర్శని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం పరిధిలోని పోలీస్ లైన్ హై స్కూల్‌లో శనివారం ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు శాఖ తరపున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాలలోని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులందరికీ శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... "గురువులను గౌరవించుకోవడం, వారి సేవలను స్మరించుకోవడం మనందరి బాధ్యత. తల్లిదండ్రుల తర్వాత పిల్లలకు విద్యాబుద్ధులు, క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేసేది గురువులే. ఒక మంచి విద్యార్థిని మంచి పౌరుడిగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం. గురువు చూపించే మార్గదర్శకత్వం విద్యార్థి జీవితంపై జీవితాంతం ప్రభావం చూపుతుంది. అందుకే గురువులను పూజించుకోవడం, గౌరవించుకోవడం మన సంస్కృతిలో ఎంతో విశిష్టమైన సంప్రదాయం" అని అన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యత, నైతిక విలువలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు మరింత చురుకైన పాత్ర పోషించాలని ఎస్పీ సూచించారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు సాంకేతికతను విస్తృతంగా ఉపయోగిస్తున్న నేపథ్యంలో వారిని సైబర్ నేరాల పట్ల అప్రమత్తం చేయాలని తెలిపారు.
అనంతరం జిల్లా ఎస్పీ సైబర్ నేరాలపై ఉపాధ్యాయులు, అధ్యాపకులు మరియు పాఠశాల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, నకిలీ ఉద్యోగ/ఇన్వెస్ట్‌మెంట్ ఆఫర్లు, సోషల్ మీడియా మోసాలు తదితర సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, ఆలస్యం చేయకుండా స్పందించడం ద్వారా ఆర్థిక నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుందని వివరించారు.
ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, పాఠశాల ప్రధాన అధ్యాపకులు మహమ్మద్ సజీద్ హుస్సేన్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, ఇతర పోలీసు అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాలయ ఇనాం భూముల్లో ప్రైవేట్ స్కూల్ దందా.?

**●పాపన్నపేటలో అక్రమంగా విద్యా సంస్థ నిర్వహణపై ఆరోపణలు**
**●అధికారుల పర్యవేక్షణ ఏదీ.? అనుమతులు ఉన్నాయా అంటూ ప్రజల ప్రశ్న**
**●స్కూల్‌లో అధిక ఫీజుల వసూళ్లపైనా విమర్శలు.. సమగ్ర విచారణకు డిమాండ్**





**పాపన్నపేట, సెప్టెంబర్ 5(నేటి దర్శిని)**
పాపన్నపేటలో దేవాలయ ఇనాం భూముల వినియోగంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దేవాలయానికి సంబంధించిన ఇనాం భూముల్లో ప్రైవేట్ స్కూల్‌ను ఎలా నిర్వహిస్తున్నారని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దేవాలయ భూములను ప్రైవేట్ విద్యా సంస్థకు వినియోగించేందుకు నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయా? లేదా అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, సదరు ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో భూముల వినియోగం,పాఠశాల నిర్వహణ, ఫీజుల వసూళ్లపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. దేవాలయ ఇనాం భూములు ప్రజా ప్రయోజనాలకు, దేవాలయ అవసరాలకు ఉపయోగపడాల్సి ఉండగా.. వాటిని ప్రైవేట్ సంస్థలకు వినియోగించే పరిస్థితి ఎలా ఏర్పడిందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంతకాలం ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఎందుకు దృష్టి సారించలేదని నిలదీస్తున్నారు. దేవాలయ భూముల రికార్డులను పరిశీలించి, పాఠశాల నిర్వహణకు సంబంధించిన అనుమతులు, భూమి వినియోగ హక్కులు, ఫీజుల వసూళ్లపై విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈవ్యవహారంపై దేవాదాయ,రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

# విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం

**● రేవంత్ పాలనలో అన్ని వ్యవస్థలు విధ్వంసం: మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**






**ఎల్.బి.నగర్, సెప్టెంబర్05 (నేటి దర్శిని):** విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలం అయ్యాడు అని, అన్ని వ్యవస్థలు విధ్వంసం అయ్యాయని మాజీమంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారము బి ఆర్ ఎస్ వి నాయకుడు షేర్ రామన్ ఆధ్వర్యంలో కొత్తపేట అష్టలక్ష్మి దేవాలయం కమాన్ నుంచి చిత్ర లేఔట్ వరకు పెద్ద ఎత్తున విద్యార్థులతో భారీ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 100 రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ 1000 రోజులు పూర్తయిన ఏ ఒక్క హామీని అమలు చేయడంలో పూర్తిగా ఈ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కెసిఆర్ పాలనలో రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా ఉంచితే , రేవంత్ పాలనలో అన్ని వర్గాలను విధ్వంసం చేసిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. రైతులు అడిగోస పెడుతున్నారని విత్తనాలు దొరకక, పండించిన పంటను కొనక, రుణమాఫీ చేయకుండా, రైతుబంధు వేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందుల గురిచేస్తున్నాడని అన్నారు. కాళేశ్వరాన్ని కూల్చాలని రేవంత్ రెడ్డి శతవిధాల ప్రయత్నిస్తున్నాడు కానీ కాలువల ద్వారా రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని ధ్యాస కూడా లేదని అన్నారు. మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని 2500 పెన్షన్, తులం బంగారం, విద్యార్థినిలకు స్కూటీ, ప్రతి మహిళను కోటీశ్వరురాలు చేస్తానని ప్రగల్భాలు పలికాడని అన్నారు. ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీని తీసుకువచ్చి యువతకు అన్ని రకాలుగా అండగా ఉంటామని అన్ని చేస్తామని హామీలు ఇచ్చాడని అన్నారు. సరూర్నగర్ కు ప్రియాంక గాంధీ వచ్చి యూత్ డిక్లరేషన్ అని చెప్పి ఓట్లు వేయించుకొని యువతను పట్టించుకోవడం లేదన్నారు. ఈ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వమని నిరుద్యోగులు అడుగుతుంటే అక్రమ కేసులు నిర్బంధాలతో అనుగదొక్కుతున్నారని అన్నారు. వంద రోజుల్లోనే రెండు లక్షల ఉద్యోగాల హామీ, జాబ్ క్యాలెండర్ ఏమైందని అన్నారు. పేద విద్యార్థులు చదువుకోవద్దని ఉద్దేశంతోటే రేవంత్ ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ఇబ్బందుల గురిచేస్తుందన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం కళ్ల తెరిచి యువతకు , సబ్బండ వర్గాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.జీ ఓ నంబర్ 97ను రద్దు చేయాలని, ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రశ్నించాలని సబితా ఇంద్రారెడ్డిని పాలిటెక్నిక్ జేఏసీ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, కొండల్ రెడ్డి ,సాజిద్, అంకిరెడ్డి, ధర్పల్లి అశోక్, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, శ్యాం గుప్తా, వెంకటేష్ , జగన్ మోహన్ రెడ్డి, వాజిద్ పటేల్, జగన్, దశరథ్, రవి , రాజు మహిళా నాయకులు లిక్కీ ఉర్మిళరెడ్డి, జయమ్మ, లక్ష్మి ,సుశీల రెడ్డి, అనురాధ ప్రమీల ,తదితరులు పాల్గొన్నారు.

# చైతన్య భారతి హైస్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు






**మిడ్జిల్, సెప్టెంబర్ 05 (నేటి దర్శిని):** మిడ్జిల్ మండల కేంద్రంలోని చైతన్య భారతి హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలుస్తూ, క్రమశిక్షణ, విలువలు, జ్ఞానాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉపాధ్యాయులను అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి





**●కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



**మిడ్జిల్ , సెప్టెంబర్ 05, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో) :** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి శాంతి కమిటీ సమావేశంలో ఎస్పీ డి.జానకితో కలిసి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన ప్రత్యేక సైబర్ అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ అపరిచిత లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, నకిలీ ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గణేష్ మండపాల్లో సైబర్ అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేయాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులను కోరారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.


**మొక్కలు నాటిన కలెక్టర్, ఎస్పీ**

అనంతరం కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ డి.జానకి, అధికారులు కలెక్టరేట్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఆర్ఓ ఏ.నిర్మల, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరాపార్క్ వద్ద బీజేపీ మహా ధర్నా

**●ఎంపీ డీకే. అరుణమ్మతో కలిసి పాల్గొన్న బిజెపి కార్యవర్గ సభ్యులు బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి**




**మిడ్జిల్ సెప్టెంబర్ 05,(నేటి దర్శిని):** హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు గారి అధ్యక్షతన నిర్వహించిన మహా ధర్నాలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే. అరుణమ్మ గారితో కలిసి బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహా ధర్నాకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.ఈ సందర్భంగా ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు.మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న డీకే. అరుణమ్మతో కలిసి బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి ధర్నాలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు నాయకత్వంలో బీజేపీ ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాటాలు కొనసాగిస్తుందని నాయకులు తెలిపారు. మహా ధర్నాలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

# శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్



**ఉమ్మడి వరంగల్, సెప్టెంబర్ 5 (నేటి దర్శిని బ్యూరో):** ప్రజల స్వేచ్ఛ కోసం శివాజీ చేసిన పోరాటాలు యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ అన్నారు.

గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ డివిజన్ ఆరేపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పూలమాలలు వేసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శివాజీ జీవితం, ఆయన చేసిన ధర్మపరమైన పోరాటాలు, ప్రజల స్వేచ్ఛ కోసం సాగించిన యుద్ధాలు స్ఫూర్తిదాయకం అన్నారు.ధర్మం, న్యాయం, స్వాభిమానంతో పాలన చేసిన శివాజీ జీవితాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సేవా సమితి కమిటీ సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ సిందె రవీందర్, అరె సంక్షేమ సంఘం అధ్యక్షులు చెట్టుపల్లి శివాజీ,మాజీ కార్పొరేటర్ శోభారాణి అనిల్,మాజీ పిఎసిఎస్ చైర్మన్ బుద్దే పెద్దన్న,ఉద్యమ కారుల సంఘం అధ్యక్షులు సోమిడి అంజన్ రావు,వరంగల్ జిల్లా అరె సంఘం అధ్యక్షులు నర్సింగ రావు,రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు చందర్ రావు, మాజీ పిఎస్ సిఎస్ చైర్మన్ బుద్దే శ్రీనివాస్,మాజీ వైస్ ఎంపీపీ బిక్షపతి,సీనియర్ నాయకులు మనోహర్,బిజిలి సంపత్,డివిజన్ ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముంబై సిద్ధివినాయక ఆలయంలో శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక పూజలు



**ఆమనగల్లు, సెప్టెంబర్ 05(నేటి దర్శిని);** ముంబైలోని ప్రముఖ శ్రీ సిద్ధివినాయక స్వామి ఆలయాన్ని ప్రముఖ సంఘ సేవకుడు, కాంట్రాక్టర్ కొమ్ముగోని శ్రీనివాస్ గౌడ్ సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ సిద్ధివినాయక స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ పరిసరాలను సందర్శించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ముంబై పర్యటనలో భాగంగా సిద్ధివినాయక ఆలయంలో దర్శనం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు నిర్వాహకులు అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు,ఆలయ సిబ్బంది ఆయనను కలుసుకున్నారు.

# టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేసిన గ్రామ సర్పంచ్ బోల్గం నాగరాజ్ గౌడ్



**మిడ్జిల్ , సెప్టెంబర్ 05, (నేటి దర్శిని):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిల్వేరు గ్రామంలోని యుపిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులను గ్రామ సర్పంచ్ నాగరాజు గౌడ్ పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని సర్పంచ్ నాగరాజు గౌడ్ పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను బోధిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ .పాఠశాల ఉపాధ్యాయులు వెంకటయ్య, గురుప్రసాద్ గౌడ్, హర్యానాయక్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

